క్లుప్తంగా

నేడు మూడు క్వింటాళ్ల కర్పూరంతో అఖండ జ్యోతి

మార్టూరు: మార్టూరు జాతీయ రహదారి పక్కన గల దుర్గా మల్లేశ్వర స్వామి దేవస్థాన ఆవరణలో నేటి సాయంత్రం 300 కిలోల కర్పూరంతో అఖండ జ్యోతి ప్రజ్వలన కార్యక్రమం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్తీక మాసం సందర్భంగా నిర్వహిస్తున్న కార్యక్రమానికి భక్తులు పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని వారు కోరారు.

మత్స్యకారులు వేటకు వెళ్లొద్దు

చీరాల టౌన్: ఫెంగల్ తుఫాన్ కారణంగా మండలంలోని సముద్ర తీరప్రాంత మత్స్యకారులు ఈనెల 30 తేదీ వరకు సముద్రంలో వేటకు వెళ్లకూడదని తహశీల్దార్ కుర్రా గోపీకృష్ణ గురువారం ఒక ప్రకటనలో ఆదేశాలు జారీ చేశారు. తుఫాన్ తీరం దాటి సాధారణ స్థితికి వచ్చేంత వరకు వాడరేవు, విజయలక్ష్మీపురం ప్రాంతాల్లోని మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్లకూడదని, తుఫాన్ కారణంగా వర్షాలు కురుస్తాయన్నారు. ఈనేపథ్యంలో వేట సామగ్రిని, పడవలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని తహశీల్దార్ ఆదేశాలిచ్చారు. తీరప్రాంత గ్రామాల్లో రెవెన్యూ సిబ్బందితో దండోరా వేయించారు.

డిసెంబర్ 1 నుంచి క్రిస్మస్ క్యారెల్స్

చినగంజాం: క్రిస్మస్ పండుగను పురస్కరించుకొని డిసెంబర్ 1వ తేదీ నుంచి చినగంజాం అంబేడ్కర్ నగర్ గ్రామ పెద్దలు, ఎంప్లాయిస్ అసోసియేషన్, అంబేడ్కర్ యూత్ సభ్యుల ఆధ్వర్యంలో క్రిస్మస్ క్యారెల్స్ నిర్వహించనున్నట్లు నిర్వాహకుడు మేకల మేషక్ బాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. క్రిస్మస్ క్యారెల్స్‌ను డిసెంబరు 25 వరకు తెల్లవారుజామున 4 గంటలు నుంచి 6గంటలు వరకు క్యారెల్స్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. క్యారెల్స్ కార్యక్రమంలో చిన్నారులు, యువతీ, యువకులు,పెద్దలు అందరూ పాల్గొనాలని ఆయన కోరారు.

విద్యార్థుల అల్పాహారానికి సాయం



హెచ్‌ఎంకు ఆర్థిక సాయం అందిస్తున్న ఉపాధ్యాయురాలు

జే.పంగులూరు: డిసెంబర్ 28న జరిగే ఎన్‌ఎంఎంఎస్ పరీక్షకు మండల పరిధిలోని చందలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 27 మంది విద్యార్థులు సన్నద్ధం అవుతున్నారు. ఈ విద్యార్థులకు సాయంత్రం జరిగే స్టడీ అవర్‌లో అల్పాహారం నిమిత్తం రూ.2000 అందించారు. ఈ డబ్బులను దాత పాఠశాలలో పనిచేస్తున్న ఆంగ్ల ఉపాధ్యాయురాలు చెరుకూరి సుజాత హెచ్‌ఎం చందలూరి గిరిజకు అందించారు. గత రెండేళ్ల నుంచి విద్యార్థుల స్టడీ నిమిత్తం సుజాత విద్యార్థులకు ఆర్థిక సాయం అందిస్తున్నారు.

నేర నియంత్రణకు చర్యలు



స్టేషన్‌లో సిబ్బందితో డీఎస్పీ రామాంజనేయులు

పర్చూరు (చినగంజాం): నేర నియంత్రణకు సిబ్బంది గట్టి చర్యలు తీసుకోవాలని బాపట్ల డీఎస్పీ గోగినేని రామాంజనేయులు సూచించారు. పర్చూరు పోలీస్ స్టేషన్‌ను ఆయన గురువారం సందర్శించి పరిశీలించారు. ముందుగా ఆయన పోలీసు స్టేషన్ పరిసర ప్రాంతాలను పరిశీలించారు. మండలంలో నెలకొన్న సమస్యలను ఎస్‌ఐ మాల్యాద్రిని అడిగి తెలుసుకున్నారు. పోలీస్ స్టేషన్‌లోని రికార్డులను తనిఖీ చేశారు. నేర నియంత్రణ కోసం తీసుకోవాల్సిన చర్యలు గురించి ఆయన సిబ్బందికి వివరించారు. వార్షిక తనిఖీలో భాగంగా స్టేషన్ సందర్శించినట్లు ఆయన తెలిపారు.

పకడ్బందీగా సర్వే పూర్తి చేయాలి



సర్వేపై మాట్లాడుతున్న ఎంపీడీవో

బల్లికురవ: గ్రామాల వారీగా సన్న, చిన్న, మధ్య తరగతికి సంబంధించిన సర్వేను పకడ్బందీగా పూర్తిచేయాలని ఎంపీడీవో కుసుమ కుమారి కోరారు. గురువారం స్థానిక కార్యాలయంలో మండలంలోని 20 సచివాలయాల్లోని సెక్రటరీలు, వెల్ఫేర్ డిజిటల్ ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లతో సర్వేపై అవగాహన కల్పించారు. శుక్రవారం నుంచి సర్వేను పూర్తిచేసి నివేదికను కార్యాలయంలో అందజేయాలన్నారు. ఈవోఆర్డీ దాసరి సుమతి మాట్లాడుతూ తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో గ్రామంలోని సెక్రటరీలు, సచివాలయ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు.

బడి గంట.. విద్యార్థులకు తంట

- ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు బడి
- మారనున్న పాఠశాల టైమ్‌టేబుల్
- నియోజకవర్గంలో రెండు పాఠశాలలకు వర్తింపు
- వ్యతిరేకిస్తున్న ఉపాధ్యాయ సంఘాలు



కస్తూరిబా మున్సిపల్ బాలికోన్నత పాఠశాల

చీరాల అర్బన్: కూటమి అధికారంలోకి వచ్చాక విద్యా వ్యవస్థను ఎలా నాశనం చేసిందో మనమందరం చూస్తూనే ఉన్నాం. కేవలం కార్పొరేట్, ప్రైవేటు విద్యాసంస్థలను పెంచిపోషించడానికే పనిచేస్తోంది. ఇంగ్లిష్ మీడియం, టోఫెల్, సీబీఎస్‌ఈ, ట్యాబ్‌లు, బైజూస్ తదితర అంశాలను ఒక్కొక్కటిగా రద్దు చేస్తూ పేద, మధ్యతరగతి కుటుంబాల పిల్లలను ఎదగనీయకుండా ముందుకు వెళ్తోంది. ఈక్రమంలో ఉపాధ్యాయులను కూడా శతవిధాల ఇబ్బందులకు గురిచేస్తోంది. రోజూ వారీ జరిగే బడి సమయాన్ని గంటకు పెంచారు. పాఠశాల పని వేళలు పెంచుతూ విద్యాశాఖ ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. పాఠశాల పనివేళలు పెంచుతూ తీసుకున్న నిర్ణయంపై అభిప్రాయ సేకరణకు మండలానికి ఒక పాఠశాల చొప్పున ఎంపిక చేశారు. పని వేళలు పెంపుపై వచ్చిన అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని అన్ని పాఠశాలలో అమలు చేసేందుకు కసరత్తు చేసింది. దీనిపై ఉపాధ్యాయ యూనియన్ల నాయకులు పెదవి విరుస్తున్నారు.

వివరాల్లోకి వెళితే..

అశాస్త్రీయ నిర్ణయాలతో కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతుంది. ప్రభుత్వ పాఠశాలల పనివేళలు పెంచడమే అందుకు ఉదాహరణ. ప్రభుత్వ ఆధీనంలో ఉన్న అన్ని ఉన్నత పాఠశాలల సమయాన్ని పెంచుతూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై అన్ని వర్గాల్లో వ్యతిరేకత వ్యక్తమవుతోంది. చీరాల మండలంలో మొత్తం 15 ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. వీటిలో 5007 మంది విద్యార్థులు ఉన్నారు. ఈ నెల 25 నుంచి 30వ తేదీ వరకు కొత్త సమయాన్ని పాఠశాలల్లో అమలు చేస్తున్నారు. నియోజకవర్గానికి రెండు పాఠశాలలు చొప్పున ఎంపిక చేశారు. చీరాల మండలంలో కస్తూరిబాగాంధీ మున్సిపల్ బాలికోన్నత పాఠశాల, వేటపాలెం మండలంలో పందిళ్లపల్లి హైస్కూల్‌ను ఎంపిక చేశారు. ఎంపిక చేసిన పాఠశాలల్లో కొత్త టైం టేబుల్ ప్రకారం తరగతులు నిర్వహించనున్నారు. ఈ ఐదు రోజుల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఎదుర్కొన్న సమస్యలు, విద్యార్థులకు కలిగిన ప్రయోజనాలను పరిశీలించి ఎంఈఓలు నివేదికను తయారు చేసి జిల్లా విద్యాశాఖకు పంపనుంది.

బ్రేక్, భోజన విరామ సమయం పెంపు..

ప్రస్తుత పాఠశాలలు ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు నిర్వహిస్తున్నారు. కొత్త టైమ్ టేబుల్ ప్రకారం ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పనిచేస్తాయి. ఉదయం, మధ్యాహ్నం ఇచ్చే బ్రేక్ సమయాన్ని 5 నిమిషాల చొప్పున, భోజన విరామ సమయాన్ని 15 నిమిషాలు పెంచారు. ఉదయం మొదటి పీరియడ్‌ను 50 నిమిషాలు చేశారు. ఆ తర్వాత మూడు పీరియడ్లు ప్రస్తుతం 40 నిమిషాలు చొప్పున ఉన్నాయి. వాటిని 45 నిమిషాలకు పెంచారు. మధ్యాహ్నం మొదటి పీరియడ్ మార్చకుండా అనంతరం జరిగే మూడు పీరియడ్లను 45 నిమిషాలకు పెంచారు. ఈ మార్పు కారణంగా రోజులో పాఠశాల సమయం గంట పెరుగుతుంది.

ఉపాధ్యాయ సంఘాల ఆందోళన..

కొత్త విద్యావిధానంపై ఉపాధ్యాయ సంఘాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. పాఠశాలల పనివేళలు మార్చాలంటే విద్యార్థుల మానసిక స్థితి, విద్యార్థి అభ్యసన సంసిద్ధత, రవాణా సౌకర్యం, విద్యార్థినుల భద్రత తదితర అంశాలను పరిగణనలోకి తీసుకోవాలి. పని సమయం పెంచడం వలన సరైన సమయానికి రవాణా సౌకర్యం ఉండదు. బాలికలకు భద్రతా సమస్యలు తలెత్తే అవకాశం ఉంటుంది. ప్రధానంగా విద్యార్థి తరగతి గదిలో ఎంత సమయం శ్రద్ధగా అభ్యసించే అవకాశం ఉంటుందనే అంశాలను పరిశీలించాల్సి ఉంది.

గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఇబ్బందులు..

పాఠశాలల పనివేళలు పెంచుతూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై గ్రామీణ ప్రాంత విద్యార్థుల భద్రతకు పెనుముప్పు వాటిల్లే ప్రమాదం ఉంది. చాలా పాఠశాలలకు ఇంటి కొద్ది కిలోమీటర్ల దూరంలో ఉన్న గ్రామీణ ప్రాంతాల నుంచి విద్యార్థులు రాకపోకలు సాగిస్తున్నారు. ప్రస్తుతం ఉన్న సమయాన్ని బట్టి సాయంత్రం 4 గంటలకు బడి ముగించుకుని విద్యార్థులు ఇంటికి చేరుకునేలోపు ఎంత లేదన్నా చీకటి పడుతుంది. అలా కాకుండా పాఠశాలల సమయం పెంచడం ద్వారా సాయంత్రం 5 గంటలకు బడి నుంచి బయటకు వచ్చిన విద్యార్థులకు సరైన రవాణా సౌకర్యం లేక ఇబ్బంది పడాల్సి వస్తుంది.

ఉపాధ్యాయ యూనియన్లు వ్యతిరేకిస్తున్నాయి..



పాఠశాలల పని గంటలు పెంచడం ఆమోదయోగ్యం కాదు. ఈ విధానం వలన గ్రామీణ ప్రాంత విద్యార్థులు ఇబ్బందులు పడతారు. రవాణా సౌకర్యం సక్రమంగా ఉండదు. ఇంటి వెళ్లేసరికి రాత్రి అవుతుంది. పట్టణాలతో పాటు గ్రామీణ ప్రాంత విద్యార్థినులను కూడా దృష్టిలో ఉంచుకోవాలి. పనిగంటల పెంపును అన్ని ఉపాధ్యాయ యూనియన్లు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి.

– వంకా ప్రభాకరరావు, ఎస్టీయూ స్టేట్ ఫైనాన్స్ కమిటీ మెంబర్

విద్యార్థులు ఇబ్బందులు పడతారు..



ఉన్నత పాఠశాలల పనివేళలు మరో గంట పెంచాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం సరైనది కాదు. దీనిని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాం. పని గంటలు పెంచడం వలన విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బందులు పడతారు. పాఠశాలల పనిగంటలు పెంచేందుకు ముందుగా ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల అభిప్రాయాలు కూడా తీసుకుంటే మంచిది.

– పీ సురేష్, యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి

ప్రభుత్వ ఆదేశాల మేరకు పనిగంటల పెంపు..

ఈ నెల 25వ తేదీ నుంచి 30 వ తేదీ వరకు కొత్త టైం టేబుల్ ప్రకారం నిర్వహిస్తున్నాం. ఐదు రోజులు పాటు మండలానికి ఒక ఉన్నత పాఠశాల చొప్పున ఎంపిక చేసి పైలెట్ ప్రాజెక్టు కింద తరగతులు నిర్వహిస్తున్నాం. ఐదు రోజులు విద్యార్థులు, ఉపాధ్యాయుల అభిప్రాయాలను తీసుకుని ఉన్నతాధికారులకు నివేదిక ఇస్తాం.

– పీ సుబ్రహ్మణ్యేశ్వరరావు, ఎంఈఓ

చెక్ డ్యాం నిర్మాణ అంచనాలకు ఆదేశాలు

ఇంకొల్లు (చినగంజాం): దుద్దుకూరు వాగుపై యారా కెనాల్, చెక్ డ్యాం, వాటర్ షెడ్ నిర్మాణానికి అంచనాలు తయారు చేయాలని నీటి వనరుల శాఖ, మైనర్ ఇరిగేషన్ ప్రభుత్వ సంయుక్త కార్యదర్శి ఎస్‌కే వెంకటచార్యులు ఆదేశాలు జారీ చేసినట్లు మార్స్ ట్రస్ట్ చైర్మన్ మన్నె శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. దుద్దుకూరు వాగుకు ప్రవాహ సరళి సక్రమంగా లేనందున ఉత్తరంగా ఉన్న బాడవ భూముల్లో వరద మేటవేసి వ్యవసాయ యోగ్యంగా లేవన్నారు. పర భూముల నుంచి మద్దిరాల వాగు వరకు యారకాలువ (ఫీల్డ్ ఛానల్), చెక్ డ్యాంలు, వాటర్ షెడ్‌లు ఏర్పాటు ద్వారా ఈ ప్రాజెక్ట్ కింద వందలాది ఎకరాలు సాగులోకి వస్తాయని, ముప్పాళ్ల, మద్దిరాల గ్రామాలకు చెందిన రైతుల భూమికి కూడా కనీస ఆరుతడికి సాగునీటికి వసతి కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని స్థానిక రైతులతో పాటు తాను కోరినట్లు ఆయన తెలిపారు.

ఫిబ్రవరి 25 వరకు పంట నమోదు



పంట నమోదు పరిశీలిస్తున్న ఏవో సుబ్బారెడ్డి

జే.పంగులూరు: రబీ 2024–25 కాలానికి సంబంధించి పంట నమోదు కార్యక్రమం ఫిబ్రవరి 25 వరకు జరుగుతుందని మండల వ్యవసాయాధికారి డీ సుబ్బారెడ్డి తెలిపారు. మండల పరిధిలోని బైటమంజులూరు, రామకూరు గ్రామాల్లో గురువారం మండల వ్యవసాయాధికారి డి సుబ్బారెడ్డి పంటసాగు నమోదు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంట నమోదు చేసుకోవటం వలన పండించిన పంటలను ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలలో రైతులు మద్దతు ధరకు అమ్ముకొనుటకు, ప్రకృతి వైపరీత్యాలను పంట నష్టం, సున్నా వడ్డీ రాయితీ పొందుటకు ఉపయోగ పడుతుందని తెలిపారు. రబీ సీజన్‌లో స్వచ్ఛందంగా పంట బీమా చెల్లించిన రైతులకు బీమా వర్తించాలంటే తప్పనిసరిగా పంట నమోదు చేసుకోవాలని తెలిపారు. మొక్క జొన్న పంట నమోదు కార్యక్రమాన్ని బైటమంజులూరు, రామకూరు గ్రామాల్లో పరిశీలించారు.

జ్యోతిరావు పూలే చిరస్మరణీయుడు



అద్దంకిలో పూలే చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న రోటరీ సభ్యులు



పూలే విగ్రహానికి పూలమాలలు వేస్తున్న మున్సిపల్ చైర్మన్, వైస్‌చైర్మన్లు

చీరాల: మహాత్మా జ్యోతిరావు పూలే దేశానికి చేసిన సేవలు మరువలేనివని వైఎస్సార్ సీపీ నాయకులు పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్ ఆదేశాల మేరకు గురువారం పట్టణంలోని గడియార స్తంభం సెంటర్‌లో జ్యోతిరావు పూలే విగ్రహానికి మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, పార్టీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ బహుజనుల ఉద్ధరణకు ఆనాడే సంఘ సంస్కరణలు తీసుకువచ్చిన మహనీయుడు జ్యోతిరావు పూలే అని కొనియాడారు. మహిళా విద్యకు పెద్దపీట వేసి మహిళా పాఠశాలలను స్థాపించిన ఆయన ఎప్పటికి చిరస్మరణీయుడన్నారు. పూలే పోరాట ఫలితమే నేడు బహుజనుల అభివృద్ధికి పునాది అని, ఒక వ్యక్తి పోరాట ఫలితాలు భవిష్యత్తు తరాలకు ఫలాలు అందుతాయన్నారు. సమాజంలోని రుగ్మతలను రూపుమాపే సంఘ సంస్కరణలు చేశారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ బొనిగల జైసన్‌బాబు, పార్టీ రూరల్ అధ్యక్షుడు ఆసాది అంకాలరెడ్డి, గవిని శ్రీనివాసరావు, కోడూరి ప్రసాద్‌రెడ్డి, బుర్ల సాంబశివరావు, రమేష్, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో..

అద్దంకి రూరల్: రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో గురువారం మహాత్మాజ్యోతిరావ్ పూలే వర్ధంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పూలే చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. క్లబ్ అధ్యక్షుడు చప్పిడి వీరయ్య మాట్లాడుతూ కులవివక్షతకు వ్యతిరేకంగా, మహిళా విద్యకోసం జీవితాంతం పాటు పడ్డారని కొనియాడారు. మనందరం పూలే బాటలో నడవాలని ఆరు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సెక్రటరీ చుండూరి మురళీ సధాకరరావు, మల్లాది శ్రీనివాసరావు, పసుపులేటి ఆంజనేయులు, షేక్ మహమ్మద్ రఫీ, అళహరి హరిప్రసాద్, చిన్ని మురళీకృష్ణ, బీ. రామ్మోహనరావు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలతో ప్రమాదాలకు చెక్



లారీ యజమానులతో మాట్లాడుతున్న ఎస్సై

బల్లికురవ: లారీ యజమానులు, డ్రైవర్లు, ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే ప్రమదాలకు చెక్ పెట్టవచ్చని ఎస్సై జీవీ చౌదరి కోరారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో గురువారం మండలంలోని లారీ యజమానులతో సమావేశం నిర్వహించారు. గ్రానైట్ రవాణాలో అనుభం ఉండి డ్రైవింగ్ లైసెన్స్ కలిగిన డ్రైవర్లను నియమించుకోవాలన్నారు. ప్రభుత్వానికి చెల్లించాల్సిన ట్యాక్స్‌లు సకాలంలో చెల్లిస్తూ ధ్రువీకరణ పత్రాలతో పర్మిట్‌తోనే ఎగుమతులు చేపట్టాలన్నారు. పర్మిట్ లేకుండా అక్రమంగా రాళ్ల అక్రమగా తరలించే లారీలను సీజ్ చేసే ప్రమాదం ఉందని చెప్పారు. లారీలు నడిపేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఎస్సై వివరించారు.

ఎయిడ్స్ రహిత సమాజం సమష్టి బాధ్యత



సమావేశంలో మాట్లాడుతున్న కృష్ణమూర్తి

మార్టూరు: సామాజిక బాధ్యతగా భావించి కృషి చేసినప్పుడే హెచ్‌ఐవీ, ఎయిడ్స్ నిర్మూలన సాధ్యమవుతుందని ప్రముఖ హైకోర్టు న్యాయవాది కొల్లా కృష్ణమూర్తి అన్నారు. మండలంలోని అంగన్వాడీ కార్యకర్తలతో గురువారం సాయంత్రం మార్టూరులో నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. డిసెంబర్ 1వ తేదీ అంతర్జాతీయ ఎయిడ్స్ దినాన్ని పురస్కరించుకొని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశానుసారం, నవంబర్ 29వ తేదీ సాయంత్రం అంగన్వాడి కేంద్రాల్లో ముగ్గుల పోటీలు నిర్వహించాలని హెల్ప్ స్వచ్ఛంద సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ బీవీ సాగర్ తెలిపారు. ఎయిడ్స్ వ్యాధితో మరణించిన వారి కుటుంబ సభ్యులకు మేము అండగా ఉంటాం అనే ధైర్యాన్ని కలుగజేస్తూ 30వ తేదీ సాయంత్రం 6 గంటలకు ఆత్మశాంతి సంఘీభావ ర్యాలీ నిర్వహించాలన్నారు. డిసెంబర్ 1తేదీ అంతర్జాతీయ ఎయిడ్స్ దినాన్ని పురస్కరించుకొని అవగాహన ర్యాలీలను స్థానికంగా నిర్వహించాలని సాగర్ తెలిపారు. కార్యక్రమంలో ఎంఈవో వస్రం నాయక్, సూపర్వైజర్లు కె పద్మ, శ్రీదేవి, హెల్ప్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు దుర్గ, రూతు, రమ్య, సరోజినీ తదితరులు పాల్గొన్నారు.

బైక్‌పై నుంచి పడి మహిళకు గాయాలు



క్షతగాత్రురాలిని ఆసుపత్రికి తరలిస్తున్న ఎస్‌ఐ వెంకట్రావు

కారంచేడు: బైక్‌పై ప్రయాణిస్తూ వెనుకకు పడిపోవడంతో ఒక మహిళ గాయాలపాలయ్యింది. ఎస్సై వీ వెంకట్రావు వివరాల మేరకు.. మండలంలోని స్వర్ణ గ్రామానికి చెందిన జీ శ్రీనివాసరావు, పద్మావతి దంపతులు గురువారం ఉదయం తమ ద్విచక్ర వాహనంపై స్వర్ణ నుంచి కారంచేడు వస్తున్నారు. ఈ క్రమంలో కారంచేడు–స్వర్ణ గ్రామాల మధ్యన నాగేంద్రస్వామి పుట్ట సమీపంలో రోడ్డుకు అడ్డుగా గడకర్ర అడ్డుగా ఉండటంతో దానిని తప్పించే క్రమంలో ఆ కర్ర చీర కొంగుకు పట్టుకుంది. దీంతో ఆమె వెనుకకు పడిపోవడంతో ఆమె తలకు తీవ్రమైన గాయమైంది. కొందరి సమాచారంతో ఘటన స్థలానికి వచ్చిన ఎస్‌ఐ 108 వాహనం అందుబాటులో లేకపోవడంతో ఆటోలో చీరాల ఆసుపత్రికి పంపించారు.

డిసెంబర్ 7 నుంచి తల్లిదండ్రుల సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈవో

అద్దంకి రూరల్: మండలంలోని అన్ని పాఠశాలలో డిసెంబర్ 7న నిర్వహించనున్న తల్లిదండ్రుల సమావేశాలు విజయవంతం చేయాలని ఎంఈవో గంగాధరరావు అన్నారు. గురువారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో డిసెంబర్ 7న నిర్వహించనున్న పేరెంట్, టీచర్ సమావేశానికి సన్నహాక సమావేశం నిర్వమించారు. విద్యాశాఖ సూచనల మేరకు 12 కమిటీల ఏర్పాటు చేసుకుని విద్యార్థుల తల్లిదండ్రులు హాజరైయ్యేటట్లు ఉపాధ్యాయులందరూ సమష్టి కృషిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి, ఎంపీడీవో, తాహసీల్దార్, అద్దంకి మున్సిపల్ కమిషనర్, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

ముగిసిన సువార్త స్వస్థత సభలు



సువార్త స్వస్థత సభలకు హాజరైన క్రైస్తవులు

చీరాల రూరల్: స్థానిక జయంతిపేటలోని సెయింట్ ఆన్స్ స్కూలు సమీపంలో హోసన్న గ్రౌండ్‌లో గుంటూరు హోసన్న మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న హోసన్నా సువార్త స్వస్థత సభలు బుధవారం రాత్రి ముగిశాయి. ఫ్లడ్‌లైట్ వెలుగులలో కేవలం రాత్రి సమయాలలో మాత్రమే నిర్వహించిన ఈ సువార్త స్వస్థత సభలలో ముఖ్య ప్రసంగీకులుగా పాస్టర్లు జాన్‌వెస్లీ, రాజు, అబ్రహంలు పాల్గొని దేవుని వాక్య సందేశాలు అందించారు. మన పాపాలను క్షమించేందుకు లోక రక్షకుడిగా ప్రభువైన ఏసుక్రీస్తు భూమిపై జన్మించి శిలువ మరణం పొందాడని వారు గుర్తు చేశారు. ప్రభువైన ఏసుక్రీస్తును రక్షకుడిగా అంగీకరించి మనస్ఫూర్తిగా ప్రార్థిస్తే మన ఎడల అద్భుత కార్యాలు జరుగుతాయని చెప్పారు. ఈసభలకు క్రైస్తవ విశ్వాసులు పోటెత్తారు. సభలకు హాజరైన విశ్వాసులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా మంచినీటి వసతి, భోజన సదుపాయాలను నిర్వహకులు కల్పించారు.

డంపింగ్ యార్డు కాదిది.. స్టేట్ బ్యాంక్



స్టేట్ బ్యాంక్ పక్కన గుట్టలుగా పేరుకుపోయిన చెత్తాచెదారం

మార్టూరు: పైన కనిపించే దృశ్యాన్ని చూస్తే డంపింగ్ యార్డ్ అనుకుంటే పొరపాటు పడినట్లే. నిత్యం వందలాది మంది కస్టమర్లు రాకపోకలు సాగించే మార్టూరు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గేటు పక్కన కనిపిస్తున్న దృశ్యం ఇది. వర్షాకాలం కావడం, సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నా స్థానిక పంచాయతీ అధికారులకు కానీ సిబ్బందికి కానీ రోజుల తరబడి గుట్టలుగా పెరిగిపోతున్న చెత్త దాని నుంచి వ్యాపించే దుర్గంధం కానీ కనిపించకపోవడాన్ని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఈ రోడ్డు మార్గాన రాకపోకలు సాగించాలన్నా, బ్యాంకుకు వెళ్లాలన్నా దుర్గంధంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు విమర్శిస్తున్నారు. పంచాయతీ అధికారులు దృష్టి పెట్టి చెత్తను తొలగించి రోడ్డు మార్గాన్ని శుభ్రపరచాలని ప్రజలు కోరుతున్నారు. లేకపోతే జ్వరాలు వస్తాయని ఆందోళన చెందుతున్నారు.

సమస్యల పరిష్కారంలో అలసత్వం తగదు

చీరాల టౌన్: సమస్యల పరిష్కారంలో పంచాయతీల కార్యదర్శులు, సచివాలయాల ఉద్యోగులు అలసత్వం వహించకుండా విధులు నిర్వహించాలని ఎంపీడీవో పి.శివసుబ్రమణ్యం సూచించారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీల కార్యదర్శులు, సచివాలయాల అడ్మిన్లతో అభివృద్ధి పనులపై సమావేశం నిర్వహించారు. పంచాయతీల వారీగా చేస్తున్న సీసీరోడ్డు నిర్మాణాలు, అభివృద్ధి పనులతో పాటుగా పారిశుద్ధ్య సమస్యలు లేకుండా చూడాలన్నారు. ఈసందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీల కార్యదర్శులు విధిగా ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. ప్రజా సమస్యల త్వరగా పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలన్నారు. సమావేశంలో ఈవోఆర్డీ రామకృష్ణ, పంచాయితీ సెక్రటరీలు, సచివాలయాల అడ్మిన్లు, వెల్ఫేర్ అసిస్టెంట్లు ఉన్నారు.

పింఛన్ల పంపిణీ సమర్థవంతంగా నిర్వహించాలి..

ప్రభుత్వం పింఛన్ లబ్ధిదారులకు ఈనెల 30 తేదీనే డిసెంబర్ నెల ఫించన్లు పంపిణీ చేయాలని ఆదేశాలు జారీ చేసిందని సచివాలయాల సెక్రటరీలు, పంచాయతీల కార్యదర్శులు ఫించన్లు పంపిణీని సక్రమంగా చేయాలని ఎంపీడీవో సూచించారు.

శింగరకొండ దర్శిని

అద్దంకి: క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, కార్తీక మాసం, స్వాతి నక్షత్రం, త్రయోదశి తిథి సందర్భంగా శుక్రావారం ప్రత్యేక పూజలు చేస్తారని దేవస్థాన ఏసీ తిమ్మనాయుడు గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం బిందె తీర్థం, మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 గంట వరకు పంచ హారతుల పూజ నిర్వహిస్తారు. రాత్రి 7 గంటల నుంచి 7.45 గంటల వరకు జరిగే ప్రదోషకాలార్చన అనంతరం ఆలయం మూసివేస్తారు.